# కేంద్రం ఇవ్వకున్నా.. వెనకడుగు వేయలే..


యువ గర్జన సభావేదికపై మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి

- జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకున్నాం
- ఫ్యాక్స్‌కాన్‌ను కర్ణాటకకు తరలించుకుపోయేందుకు కాంగ్రెస్ కుట్ర
- యువత సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట
- విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో ప్రాధాన్యత ఇస్తున్నాం
- జిల్లెలగూడ యువ గర్జనలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- మీర్‌పేట్‌లో యువ గర్జన సక్సెస్

బడంగ్‌పేట్, నవంబర్ 5 : యువత సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో ఆదివారం రాత్రి నిర్వహించిన యువ గర్జన కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి హాజరై ప్రసంగించారు. దేశంలో ఏ పార్టీకి లేనంత యువశక్తి బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. సీఎం కేసీఆర్ సైతం యువతను అక్కున చేర్చుకొని అసెంబ్లీ, పార్లమెంట్‌తోపాటు కార్పొరేషన్లలో అవకాశాలు కల్పించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే ఉద్యోగాల జాతర కొనసాగిందని, ఇప్పటికే లక్షా 60వేల ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయగా.. మరో 70వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో పురోగతిలో ఉందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న కేంద్రంలోని బీజేపీ మాటలు ఒట్టిమాటలుగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వం ఐటీఐఆర్‌ను రద్దు చేస్తే.. కాంగ్రెస్ వాళ్లు ఫ్యాక్స్ కాన్‌ను తెలంగాణ నుంచి తరలించే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గురుకులాలతోపాటు అనేక విద్యా సంస్థలను ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసుకొని విద్యా హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దుకున్నామన్నారు. కేంద్రం ఇవ్వకున్నా.. జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటును చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఓ వైపు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తూనే.. ప్రైవేటు రంగంలో 24లక్షల ఉద్యోగాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఒక్క పిలుపుతో వేలాదిగా తరలివచ్చిన యువతకు ధన్యవాదాలు తెలిపారు. చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ భారీగా తరలివచ్చిన యువతను చూస్తేనే మహేశ్వరంలో సబితక్క గెలుపు ఖాయమైనట్లు స్పష్టమవుతుందన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి సబితక్కను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ తీగల అనిత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, యువజన విభాగం మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు పవన్‌కుమార్, సభాధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు పటోళ్ల కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ స్వాగత్ గ్రాండ్ సమీపంలోని లలిత చౌరస్తాలో నిర్వహించిన యువ గర్జన కార్యక్రమం సక్సెస్ అయ్యింది. యువ ప్రభంజనంతో ఆ ప్రాంతం గులాబీమయమైంది. ఈ కార్యక్రమానికి ముందు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.


యువ గర్జనకు భారీగా తరలివచ్చిన యువకులు

## అందరూ తెలంగాణ బిడ్డలే..

- కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మొద్దు
- కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు


కేపీహెచ్‌బీ కాలనీలో కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 5 : తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగం, వ్యాపారం, బతుకుదెరువు కోసం వచ్చి కూకట్‌పల్లిలో నివసిస్తున్న వారంతా తెలంగాణ బిడ్డలే.. పండుగకు గంగిరెద్దు వాళ్లు వచ్చినట్లు.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్నికలు రాగానే ఇక్కడ వాలిపోయి.. మాయమాటలతో ప్రజలను మభ్యపెడతారు.. వారి మాటలు నమ్మొద్దని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డు ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ కాపు నేతల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కులాలు, మతాలకతీతంగా ప్రజలందరూ కలిసిమెలిసి జీవించడంతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారని తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బతకడానికి వచ్చిన వారంతా తెలంగాణ బిడ్డలేనని, సెటిలర్లు అనే పదం వాడొద్దన్నారు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్న ప్రజల మధ్యన చిచ్చుపెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని.. దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి, కిషన్‌రెడ్డి ఆరోపణలు చేస్తారని.. ఏనాడైనా రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నారా.. అని ప్రశించారు. తనను అన్నగా.. తమ్ముడిగా భావించి రెండు పర్యాయాలు అఖండ మెజార్టీని అందించిన కూకట్‌పల్లి ప్రజలు.. మరోసారి గెలిపిస్తే రుణం తీర్చుకుంటానన్నారు. ఈ సందర్భంగా కాపు నేతలు ఎమ్మెల్యే కృష్ణారావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబూరావు, తూము శ్రవణ్‌కుమార్, అడుసుమల్లి వెంకటేశ్వర్‌రావు, బసల శ్రీనివాస్, హెచ్ఎన్ మూర్తి, భగవాన్, మోటెపల్లి రంగమోహన్, రమణప్రసాద్, వలవలనాయుడు, వాసునాయుడు, ప్రభాకర్, బుట్టో రాంబాబు, పున్నారావు, భవానీ, ధనలక్ష్మి, రాజేశ్ రాయ్, శంకర్, దినేశ్, బాలకృష్ణ, నాగేశ్వర్‌రావు, నాగమల్లేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీకే సంపూర్ణ మద్దతు

**ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ ఆర్గనైజేషన్ జాతీయ, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు**



ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్న ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ ఆర్గనైజేషన్ జాతీయ, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్శిటీ, నవంబర్ 5 :తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ ఆర్గనైజేషన్ జాతీయ, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించిన సమావేశంలో విలేకరుల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. గిరిజన రిజర్వేషన్‌ను 6 నుంచి 10 శాతానికి పెంచి లంబాడీ గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. వందల సంవత్సరాలుగా సాగు చేయని పోడు భూములకు హక్కు పత్రాలను ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు, ఎంపీ సీతారాంనాయక్, బీఆర్ఎస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బాదావత్ లక్ష్మణ్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి నరేశ్ నాయక్, కార్యదర్శి సివానాయక్, ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రంలో.. క్యూ తక్కువే ఉంది

- త్వరగా వచ్చి ఓటేయండి
- ఓటర్లకు క్యూ లైన్ల అప్‌డేట్ మెసేజ్
- గ్రేటర్ పరిధిలో తొలిసారి టెక్నాలజీ ఆధారిత సేవలు
- ఓటింగ్ పెంచేందుకు అధికారుల ప్రయత్నం

సిటీబ్యూరో, నవంబర్ 5(నమస్తే తెలంగాణ) :
గ్రేటర్‌లో భారీగా ఓటర్లు ఉన్నా.. ఓటేసేవాళ్లు తక్కువ. వచ్చినా భారీ క్యూ లైన్లు తిరిగిపోయే అవకాశం ఉంటుంది. ఇక గంటల తరబడి క్యూ లైన్లలో ఎలా నిలబడలి..? అంటూ ఇంటికే పరిమితమయ్యే వారుంటారు. అలాంటి వారందరినీ దృష్టిలో ఉంచుకొని మహానగరంలో ఎన్నికల అధికారులు ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నారు. గ్రేటర్‌లో ఓటర్ నమోదు, డోర్ టూ డోర్ క్యాంపెయిన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలతో ప్రతి ఓటర్ వద్దకు ఎన్నికల అధికారులు వెళ్తుండగా.. తాజాగా పోలింగ్ రోజున ఓటర్లను ఇంటికి పరిమితం కాకుండా ముందస్తు మెసేజ్‌లను పంపేందుకు బల్దియా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మెసేజ్‌ల ద్వారానే ఓటర్ పోలింగ్ స్టేషన్, అక్కడి క్యూ లైన్ల పరిస్థితిని తెలుసుకునే సదుపాయాన్ని తీసుకువస్తున్నారు. ప్రస్తుతం ప్రయోగదశలో ఉండగా.. ఎన్నికల తేదీ నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని బల్దియా వర్గాలు చెబుతున్నాయి.




### ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు..

ఎన్నికలు ఏవైనా అర్బన్‌లో ఓటింగ్ ప్రక్రియ అత్యంత తక్కువగా నమోదవుతుంది. ఈ క్రమంలో టెక్నాలజీ ఆధారిత సేవలతో అర్బన్ ఓటర్లను ఆకట్టుకునేలా అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అంచనా ప్రకారం అక్షరాస్యులు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన ప్రాంతాలను గుర్తించగా, ఓటు వేయకపోవడానికి గల కారణాలను అన్వేషించారు. ఈ క్రమంలో మెజార్టీ ఓటర్లు భారీ క్యూ లైన్లు, మౌలిక వసతులు లేకపోవడమేనని వ్యక్తం చేసిన అభిప్రాయాలతో.. పోలింగ్ స్టేషన్ల వద్ద టాయిలెట్లు, వాటర్ ఫెసిలిటీ, షాడో నెట్స్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో వైపు గ్రేటర్‌లో ఇంటింటి ప్రచారంతో పాటు, డోర్ స్టిక్కరింగ్ వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయినా కూడా ఓటరు గడప దాటి బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపడంలేదనే అపవాదు ఉన్నది. ఈ సారి గ్రేటర్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నారు.

### ఎస్ఎంఎస్ ద్వారా క్యూలైన్ అప్‌డేట్

ఇప్పటికే గ్రేటర్ వ్యాప్తంగా మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, యంగ్ ఓటర్లు థీమాటిక్ పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అదే విధంగా పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న క్యూ లైన్ వివరాలను స్థానికంగా ఉండే ఓటర్లకు ఎప్పటికప్పుడు తెలిపితే ఓటింగ్ పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. దీనికోసమే ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేసి, బల్క్ ఎస్ఎంఎస్ ద్వారా క్యూ లైన్ అప్‌డేట్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.